ఎర్రగుట్టపై అక్రమార్కుల కన్ను


మల్యాల చింతల చెరువులో మట్టి తవ్విన వైనం


ఎర్రగుట్ట వద్ద మట్టి తవ్విన వైనం

- రాత్రివేళ గుట్టుచప్పుడు కాకుండా మట్టి తరలింపు
- చదును చేసి వ్యవసాయ భూమిగా మార్పు
- పట్టించుకోని అధికారులు

ఇల్లందకుంట: ప్రభుత్వ గుట్టలు, భూములపై కబ్జాదారులు కన్నేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా.. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఎర్రగుట్ట నేడు కబ్జాదారుల చేతుల్లో కళ్ల ముందే కరిగిపోతూ కకావికలమవుతుంటే పట్టించుకునే నాథుడే కరువవడం ఆశ్చర్యానికి గురి చేస్తోందని అధికారుల తీరుపై పలువురు మండిపడుతున్నారు. సర్వే నం.387లో 117ఎకరాల21గుంటల విస్తీర్ణం ఉండాలి. కానీ కొందరు రాత్రికి రాత్రే భారీ యంత్రాలతో మట్టిని తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. భూమిని చదును చేసి వ్యవసాయ భూమిగా మార్పు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం మొద్దు నిద్ర పోవడం ఏమిటని పలు సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ప్రకృతి వరప్రసాదంగా గుట్టపై ఉన్న శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులతో చూడముచ్చటగా కనువిందు చేసే ఎర్రగుట్ట దాని పరిసర ప్రాంతాల్లో ఉండే చిన్న గుట్టలు కబ్జాదారుల చేతుల్లో కరిగిపోకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి కబ్జాకు గురైన భూమిని ఆక్రమణదారుల నుంచి వెనక్కి తీసుకొని చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే రానున్న రోజుల్లో ఉద్యమం చేపడతామని పలు సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు. ఎర్రగుట్ట, కనగర్తి, మల్యాల చింతల చెరువులోని మట్టిని భారీ యంత్రాలతో రాత్రి సమయంలో తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. గృహావసరాలకు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకున్నా.. నిబంధనలకు విరుద్ధంగా పెద్దగా గొయ్యిలు తీయడంతో.. గతంలో పలువురు ప్రమాదాల బారిన పడిన సంఘటనలున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మట్టి తీయాలంటే ప్రభుత్వానికి రుసుం చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఎలాంటి పర్మిషన్ తీసుకోకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ప్రభుత్వానికి రుసుము చెల్లించినా కేవలం పని దినాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే మట్టి తరలించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు పట్టించుకోకుండా మట్టి మాఫియా అర్ధరాత్రి సెలవు దినాల్లో అక్రమంగా మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎర్రగుట్ట, చెరువులు, కుంటలను కాపాడి మట్టి మాఫియాపై ఉక్కుపాదం మోపాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తప్పవు

గతంలో మట్టి తరలించిన వాహనాలపై కేసులు పెట్టి జరిమానా విధించాం. మట్టి తరలింపు మా దృష్టికి రాలేదు. మట్టి తరలింపు కోసం ఎవరూ అనుమతి తీసుకోలేదు. ప్రభుత్వానికి రుసుము చెల్లించకుండా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటాం.
– నవీన్, ఏఈ, ఇరిగేషన్


హుజూరాబాద్: దమ్మక్కపేటలో శ్మశాన వాటికకు వెళ్లే దారిలో వ్యవసాయ బావి ప్రమాదకరంగా మారింది. ఈ బావి చుట్టు ఎలాంటి రక్షణ గోడలు లేకపోవడంతో అటుగా వెళ్లేవారు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, సెల్ నం.: 7032651516

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

క్లుప్తంగా

కార్యదర్శిపై ఫిర్యాదు

శంకరపట్నం: మొలంగూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిపై రామక్క అనే ఒంటరి మహిళ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మొలంగూర్ గ్రామానికి చెందిన రామక్క భర్త కొన్నేళ్ల క్రితం ఇదే గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద రూ.1,80,000తో ఇంటి స్థలం కొనుగోలు చేసి తాత్కాలికంగా రేకుల షెడ్డు వేసుకున్నారు. రామక్క భర్త మరణించడంతో ఇటీవల ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇంటి కోసం ఆమె దరఖాస్తు చేసుకోగా.. ఇల్లు మంజూరైంది. రామక్క పేరిట పట్టా లేదని, మంజూరైన ఇంటి నిర్మాణం చేయకుండా కార్యదర్శి నిలుపుదల చేస్తున్నాడని, కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఆశ కార్యకర్తల భిక్షాటన


చిగురుమామిడిలో భిక్షాటన చేస్తున్న ఆశ కార్యకర్తలు

చిగురుమామిడి: కేంద్ర ప్రభుత్వం అమలు చేయతలపెట్టిన 4 లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా చిగురుమామిడిలో ఆశ కార్యకర్తలు భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, ఆశ కార్యకర్తలకు స్థిరమైన వేతన చట్టం అమలు చేయాలని కోరారు. ఆశ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెల్ల శ్రీలత, బెజ్జంకి సరోజన, బండారు సరోజన, పుష్ప, అంజలి, కవిత, తార, శ్వేత, సాహిద బేగం, మంజుల, తిరుమల పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎంఈవో

మానకొండూర్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోర్సు డైరెక్టర్ మండల విద్యాధికారి మధుసూదనాచారి కోరారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, సెకండరీస్థాయి గ్రేడ్ ఉపాధ్యాయులకు మండల స్థాయి ఐదు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 20 నుంచి 24 వరకు ఐదు రోజుల పాటు శిక్షణ జరుగుతుందన్నారు. రీసోర్స్‌పర్సన్లుగా సీహెచ్ శ్రీకాంత్, పి.శ్రీనివాస్, లక్ష్మణ్‌రావు, మహిపాల్‌రెడ్డి, డి.సుజాత, రవి, పరిమళ, రాములు పాల్గొన్నారు.

కేశవపట్నంలో వైద్య పరీక్షలు



శంకరపట్నం: కేశవపట్నం గ్రామ పంచాయతీలో మంగళవారం ఆక్యూపంక్చర్ విధానంలో వైద్యులు చికిత్స చేశారు. బీపీ, మధుమేహం, చర్మ వ్యాధులు, నొప్పులు, స్త్రీల సమస్యలు, కిడ్నీ, యూరినరి, గుండె, మెదడు, లివర్, ఊపిరితిత్తులు, చిన్న పిల్లల వ్యాధులకు నాడిని పరీక్షించి ఆక్యూపంక్చర్, నేచురోపతి విధానంలో వైద్యులు జ్ఞాన ప్రసూన, వెంగల్‌రెడ్డి, వసుధ, జ్యోతి, సోనమ్ చికిత్స అందించారు.

వీణవంక తహసీల్దార్‌గా రజిత


పుష్పగుచ్ఛం అందిస్తున్న డీటీ నిజామొద్దీన్, సిబ్బంది

వీణవంక: మండల తహసీల్దార్‌గా అంబటి రజిత మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన మంజుల సాధారణ బదిలీల్లో భాగంగా వరంగల్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. డిప్యూటీ తహసీల్దార్ నిజామొద్దీన్, ఆర్ఐ రవితోపాటు సిబ్బంది పుష్పగుచ్ఛమందించి స్వాగతం పలికారు. ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు నాగిడి సంజీవరెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ కట్కూరి మధుసూదన్‌రెడ్డి శాలువాతో సన్మానించారు.

ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ

హుజూరాబాద్: సైదాపూర్ మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సామర్థ్య శిక్షణ ప్రారంభమైనట్లు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆర్పీలు నరేంద్రప్రసాద్, ప్రవీణ్, రత్నాకర్‌రెడ్డి, శ్రీధర్, అనిల్‌బాబు, విజయ్‌కుమార్, గణేశ్, రాములు, సీఆర్పీలు తదితరులున్నారు.

పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న నమిండ్ల శ్రీనివాస్

హుజూరాబాద్: సంస్థాగతంగా పార్టీ బలోపేతంపై నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని జిల్లా పీసీసీ పరిశీలకులు, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నమిండ్ల శ్రీనివాస్, పిన్నింటి రఘునాథ్‌రెడ్డి కోరారు. మంగళవారం నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అధ్యక్షతన హుజూరాబాద్, వీణవంక, జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల పరిధిలో సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశాలు నిర్వహించారు.
జమ్మికుంట: పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో వొడితల ప్రణవ్ అధ్యక్షతన జమ్మికుంట పట్టణ, మండల సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం నిర్వహించారు. నమిండ్ల శ్రీనివాస్, పిన్నింటి రఘునాథ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి యోగా శిక్షణ ప్రారంభం


యోగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

చొప్పదండి: పట్టణంలోని గీర్వాణీ విద్యాలయ ఆవరణలో వేసవిలో ఉచిత యోగా శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. బోధకుడు సత్తినేని శ్రీనివాస్ యోగా కార్యక్రమంతోపాటు భగవద్గీత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యాలయ నిర్వాహకుడు కొండ గంగయ్య ఆధ్వర్యంలో పది రోజులపాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలను తెలిపేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని, తల్లిదండ్రులు సహకరించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెచ్ఎం ఆందుర్తి లత, కోఆర్డినేటర్లు కోడూరి నాగరాజు, సిరిపురం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన


పాల్గొన్న ఎన్‌సీసీ కెడెట్లు

హుజూరాబాద్: సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న నేషనల్ క్యాండిడేట్ క్రాప్స్ అడ్వాన్స్ లీడర్‌షిప్ క్యాంప్‌లో భాగంగా మంగళవారం కరీంనగర్ సైబర్ క్రైమ్ టీం సభ్యులు ఎన్‌సీసీ కెడెట్లకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంక్ వివరాలడిగితే చెప్పొద్దన్నారు. వివిధ మోసాలపై వివరించారు. కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ జయంత, టీఎస్ఎస్సీ టీం లీడర్ అక్రమ్, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ రవీంద్రబాబు, సుబేదార్ మేజర్ సాగర్‌సింగ్ తదితరులున్నారు.


పూజలో పాల్గొన్న హనుమాన్ స్వాములు

పంచామృతాలతో అభిషేకాలు

రామడుగు: గుండి గ్రామంలోని శ్రీభక్తాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం హనుమాన్ స్వాములు స్వామికి ప్రత్యేకంగా పూజ కార్యక్రమాలను నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకాలు, పిండి వంటలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజారి మల్లేశం, మాజీ ఉపసర్పంచ్ మేడి శ్రీనివాస్‌గౌడ్, శ్రీరామోజు మాధవాచారి, గ్రామస్తులు పాల్గొన్నారు.


పాపయ్యపల్లిలో శోభాయాత్ర

జమ్మికుంట: పాపయ్యపల్లి గ్రామంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి రథంపై ప్రతిష్ఠించి గ్రామ పుర వీధుల్లో శోభాయాత్ర చేపట్టారు. స్వాములు గుండెకారి మధు, నరసింగరావు, శంకర్, హరీశ్, మనోహర్‌రావు, శివ, రాకేశ్, పవన్, నాగరాజు, నరేశ్, అనిల్, వినోద్, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చినజీయర్‌స్వామికి ఘన స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేయాలి


అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: పట్టణంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ధ్వజస్తంభ ఆవిర్భావ కార్యక్రమానికి వస్తున్న శ్రీత్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామికి ఘన స్వాగతం పలికేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మంగళవారం సీతారామచంద్రస్వామి ఆలయాన్ని సందర్శించి పనులడిగి తెలుసుకున్నారు. ఈనెల 22న చినజీయర్‌స్వామి రానున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, సీఐ కరుణాకర్, డీఈ లక్ష్మారెడ్డి, ఏఈ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు గందె శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్, ఇరుమల్ల సురేందర్‌రెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, పూర్ణచందర్, ముత్యం రాజు, ముక్క రమేశ్, ఆలయ ధర్మకర్త క్యాస చక్రధర్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల తిరంగా ర్యాలీ



హుజూరాబాద్: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా మంగళవారం బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నాయకులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఉగ్రమూకల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టిందన్నారు. పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు, రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి గుర్రం నిర్మలారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, నాయకులు రాజు, శ్రీనివాస్, నరేశ్, కొండల్‌రెడ్డి తదితరులున్నారు.

జీలుగ విత్తనాల కోసం ఎదురుచూపులు

చిగురుమామిడి: జీలుగ విత్తనాల కోసం రైతులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నేటికి సరఫరా చేయకపోవడం విడ్డూరంగా ఉందని బీజేపీ మండల అధ్యక్షుడు పోలోజు సంతోష్‌కుమార్ అన్నారు. మంగళవారం చిగురుమామిడిలో విలేకర్లతో మాట్లాడారు. పశువుల ఎరువుకు బదులుగా జీలుగ విత్తనాలు చల్లితే రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని, వరి కోసిన వెంటనే చల్లాల్సినవి నేటికి అందుబాటులోకి రాకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు.

నిధులు మంజూరు చేయాలి

వీణవంక: దళితబంధు రెండో విడత నిధుల మంజూరులో ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తోందని, దళిత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని జేడీఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి అన్నారు. మండల కేంద్రంలో మాట్లాడారు. దళితుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతోందని, రెండో విడత నిధులు రాక అప్పులపాలవుతున్నారని ఆరోపించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



చిగురుమామిడి: పొంబండ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో హన్‌మాన్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. మంగళవారం సాయంత్రం ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ప్రముఖ జ్యోతిష్య, వాస్తు ఆగమ శాస్త్ర శాస్త్ర పండితులు శ్రీమాన్ నమిలికొండ రమణాచార్యస్వామి ఆధ్వర్యంలో పూజాకార్యక్రమంలో భాగంగా కంకణధారణ కార్యక్రమం నిర్వహించారు.

హిందూ ఏక్తాయాత్ర విజయవంతం చేయండి


మాట్లాడుతున్న రాజేందర్

జమ్మికుంట: కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఈనెల 22న జరిగే హిందూ ఏక్తాయాత్ర విజయవంతం చేయాలని ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్ అన్నారు. మంగళవారం పట్టణంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కొలకాని రాజు, సంపత్‌రావు, బైరెడ్డి రమణారెడ్డి పాల్గొన్నారు.
జమ్మికుంట పట్టణ సీఐగా రామకృష్ణ బాధ్యతలు స్వీకరించగా.. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, పట్టణ మాజీ అధ్యక్షుడు జీడీ మల్లేశం ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు.

నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడండి


మాట్లాడుతున్న ఉషారాణి

మానకొండూర్: రసాయన ఎరువులను తక్కువగా వాడి నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఉషారాణి రైతులను కోరారు. అన్నారంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గల వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్ వారి ఆధ్వర్యంలో రైతులకు మేలైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించడంతోపాటు వానాకాలం సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు వ్యవసాయ శాఖ వారితో కలిసి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే వినూత్న కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, డాక్టర్ రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్‌రావు, శ్రీధర్, కె.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం, పైపులు దగ్ధం


బొమ్మనపల్లిలో కాలిపోయిన పశుగ్రాసం

చిగురుమామిడి: బొమ్మనపల్లి గ్రామంలో సోమవారం అర్ధరాత్రి విద్యుదాఘాతంతో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ముత్యాల కొమురయ్య వ్యవసాయ బావి వద్ద నిల్వ చేసిన 1,200 గడ్డి కట్టలు దగ్ధమయ్యాయి. డ్రిప్ పైపులు కాలిపోవడంతోపాటు పాడి పశువుకు కూడా గాయాలయ్యాయి. సమాచారమందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. మరో రైతు పంట చేన్లోకి మంటలు వ్యాపించకుండా ఆపారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి


అంజయ్య(ఫైల్)

శంకరపట్నం: మెట్‌పల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మెరుగు అంజయ్య(50) మంగళవారం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో గుండెపోటుతో మరణించాడు. చొప్పదండికి చెందిన అంజయ్య భార్య భాగ్యలక్ష్మి మొలంగూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. అంజయ్య తల్లి రెండు నెలల క్రితం మరణించగా.. మంగళవారం గుండెపోటుతో అంజయ్య మరణించడం బాధాకరమని ఎంఈవో లక్ష్మినారాయణ, మెట్‌పల్లి హెచ్ఎం విష్ణుకుమార్, మొలంగూర్ హెచ్ఎం నీరజ, ఉపాధ్యాయులు, మెట్‌పల్లి గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

దుబాయ్‌లో ఓగులాపూర్ వాసి..


చందు(ఫైల్)

చిగురుమామిడి: ఓగులాపూర్ గ్రామానికి చెందిన బూడిద చందు(22) అనే యువకుడు జీవనోపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. మంగళవారం గుండెపోటుతో మృతిచెందినట్లు గ్రామస్తులు, బంధువులు తెలిపారు. నాలుగు నెలల క్రితం దుబాయ్‌కి వెళ్లగా.. అక్కడ యూటీసీ కంపనీలో హెల్పర్‌గా పని చేస్తున్నట్లు చెప్పారు. చందు ఇంటర్ వరకు చదివాడు. బూడిద కవిత–ఎల్లయ్య దంపతులకు పెద్ద కుమారుడు. ఇతడికి తమ్ముడున్నాడు. గ్రామంలో భూమి లేకపోవడంతో తండ్రి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. చందుకు వివాహం కాలేదు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం: కరీంపేట గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. తాడికల్ గ్రామానికి చెందిన చామంతుల సుధాకర్ మోటార్ సైకిల్‌పై చిగురుమామిడి మండలం బొమ్మనపల్లికి కూతురు సంధ్యతో కలిసి వెళ్తున్నాడు. తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామానికి చెందిన చెన్నబోయిన రాహుల్ మోపెడ్‌పై కేశవపట్నం వస్తుండగా.. కరీంపేట వద్ద ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో సుధాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది సతీశ్‌రెడ్డి ప్రథమ చికిత్స చేసి కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

యువతి అదృశ్యం

జమ్మికుంట: పట్టణంలో ఓ యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రామకృష్ణ మంగళవారం తెలిపారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో పరీక్ష ఉందని సోమవారం ఇంటి నుంచి వెళ్లిన యువతి(25) తిరిగి రాలేదన్నారు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులకు ఫోన్ ద్వారా సమాచారం సేకరించినా ఆచూకీ దొరకలేదని తండ్రి నర్సింగ్‌లాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి సాయం

గంగాధర: ఉప్పరమల్యాల గ్రామానికి చెందిన బరిగ శ్రీనివాస్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. గ్రామానికి చెందిన మేము సైతం సేవాసమితి సభ్యులు మంగళవారం రూ.10వేలు బాధితుడి భార్యకు అందించారు. మా ఊరు.. మా నేస్తం వాట్సాప్ గ్రూపు సభ్యులు సైతం ఆర్థిక సాయమందిస్తున్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ


మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

గంగాధర: ఇస్తార్‌పల్లి గ్రామానికి చెందిన కొత్త్తం నారాయణ అనే వ్యక్తి అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. మాజీ సర్పంచులు ఎండీ నజీర్, మడ్లపల్లి గంగాధర్ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించండి

వీణవంక: అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని వసతులున్నాయని, చిన్నారులను కేంద్రాల్లో చేర్పించాలని సీడీపీవో సుగుణ అన్నారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీ బడి బాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించారు. రమాదేవి, అన్నపూర్ణ, వినోద, శ్రావణి ఉన్నారు.